క్లుప్తంగా

శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపానికి విరాళం



విరాళం అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: పాతకర్ణవానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపం పార్కింగ్ పనుల కోసం కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు సంఘం ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు రూ.25,116 విరాళం అందజేశారు. కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మొత్తాన్ని నాయకులకు అందజేశారు. సంఘం అడహక్ కమిటీ చైర్మన్ గుడివాడ అమ్మన్న, సంఘం నాయకులు అప్పల రామ్మూర్తి, విందుల రమణ, జగదీష్, కర్రి నాగేశ్వరరావు, గంధం వెంకటరావు, ఎస్.విజయ్ కుమార్, సోంబాబు, ఇందల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి సహస్ర పుష్పార్చన



విశేష పుష్పాలతో పూజలు అందుకున్న తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. సాయంత్రం విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

మృతురాలి కుటుంబానికి స్నేహితుల సాయం

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం అభినందనీయమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 75వ వార్డు ముసలినాయుడుపాలేనికి చెందిన కర్రి భాగ్యలక్ష్మి భర్త ఏడాది క్రితం మృతి చెందారు. ఆమె చిన్న కిరాణాదుకాణం పెట్టుకుని ఇద్దరి కుమార్తెలను చదివిస్తున్నారు. వారిలో నర్సింగ్ చేస్తున్న పెద్ద కుమార్తె శ్రావణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో భాగ్యలక్ష్మి మానసికంగా కుంగిపోయారు. వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో మృతురాలి స్నేహితులు చందాలు వేసుకుని రూ.11,500 పోగు చేయగా, కేఎస్ఆర్ ఫౌండేషన్ నుంచి రూ.2వేలు కలిపి మొత్తం రూ.13,500 భాగ్యలక్ష్మికి శనివారం అందజేశారు. వంశీ, పెంటయ్య, ఇందల్, అరుణ్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం పరిశీలన



ఓటరు నమోదు కేంద్రం సందర్శించిన కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ నమోదు గురించి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సెక్టార్-1 నుంచి సెక్టార్-6 వరకు ఉన్నవారు డీఏవీ, కేంద్రీయ విద్యాలయం, విశాఖ విమల విద్యాలయంలో.. సెక్టార్-7 నుంచి సెక్టార్-12 వరకు ఉన్న వారు డీపీఎస్, జ్యోతి బాల విహార్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 3 ఆదివారం కూడా ఓటర్ నమోదు కేంద్రాలు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పాలవలస (అప్పికొండ-1, 2)	ఇస్లాంపేట	భానోజీతోట
816 ఇళ్లు	960 ఇళ్లు	1056 ఇళ్లు
	దయాల్‌నగర్ 672 ఇళ్లు	బర్మా కాలనీ 48 ఇళ్లు

కనుల ముందే.. కలల సౌధం

సొంత ఇల్లు ప్రతీ ఒక్కరి కల. ప్రతీ పైసా కూడబెట్టి, ఒక్కో ఇటుక పేర్చి, నిర్మించుకున్న కలల సౌధంలో కుటుంబంతో హాయిగా జీవించాలని ఆకాంక్షిస్తారు. దాని కోసం ఎంతో శ్రమిస్తారు. అయితే, పేదలకు ఆ భారం లేకుండా సొంతింటిని సమకూర్చాలని భావించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వ నిధులతో, ఆధునిక వసతులతో.. అందరికీ నచ్చేలా టిడ్కో గృహాలను తీర్చిదిద్దారు. త్వరలోనే వాటిని లబ్ధిదారులకు అందజేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.



ఇస్లాంపేటలో టిడ్కో గృహ సముదాయం



పెదగంట్యాడ: రాష్ట్రంలోని ఏ ఒక్క పేద కుటుంబం సొంత గూడు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకనుగుణంగా పేదలకు సొంతిళ్లు నిర్మించి అందించాలని సంకల్పించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులందరికీ గృహయోగం కల్పించారు. మరోవైపు ఏపీ టిడ్కో హౌసింగ్ స్కీం ద్వారా సకల సదుపాయాలతో గృహ సముదాయాలు నిర్మించి అందజేస్తున్నారు. 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను రాయితీపై అందిస్తున్నారు.

పెదగంట్యాడ మండలంలోని పాలవలస (అప్పికొండ), ఇస్లాంపేట, బర్మా కాలనీ, దయాల్ నగర్, భానోజీతోటలో టిడ్కో గృహ నిర్మాణ సముదాయాలు పూర్తయ్యాయి.. ఇళ్లకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశారు. వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, ఆపై తాగునీటి సదుపాయం కల్పించే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రోడ్లు నిర్మిస్తున్నారు. చిన్న చిన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.



భానోజీతోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

- పాలవలస (అప్పికొండ-1, 2)లో మొత్తం 816 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. అందులో 365 చదరపు అడుగులవి-240, 430 చదరపు అడుగులవి-576.

టిడ్కో గృహ విస్తీర్ణం	ఇంటి నిర్మాణ వాస్తవ ధర	ప్రభుత్వం నిర్ణయించిన ధర
300 చదరపు గజాలు	రూ.6.55లక్షలు	రూ.500
365 చదరపు గజాలు	రూ.7.55లక్షలు	రూ.3.15లక్షలు
430 చదరపు గజాలు	రూ.8.55లక్షలు	రూ.3.65లక్షలు



ఇది కదా అభివృద్ధి

- ఇస్లాంపేట (నడుపూరు)లో 960 ఇళ్లు నిర్మించారు. 300 చదరపు అడుగులవి-240, 365 చదరపు అడుగులవి-384, 430 చదరపు అడుగులవి-336.
- భానోజీతోటలో మొత్తం 1056 ఇళ్లు నిర్మించారు. 300 చదరపు అడుగులవి-192, 365 చదరపు అడుగులవి-384, 430 చదరపు అడుగులవి-480.
- పెదగంట్యాడ దయాల్‌నగర్‌లో మొత్తం 672ఇళ్లు నిర్మించారు. 365 చదరపు అడుగులవి-192, 430 చదరపు అడుగులవి-480.
- బర్మా కాలనీలో 365 చదరపు అడుగులు-48 ఫ్లాట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయికే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు అప్పగిస్తోంది. పేదలపై ఎటువంటి ఆర్థిక భారం పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని కారణంగా వారంతా సంతోషంగా ఉన్నారు.



హాల్

చాలా సంతోషంగా ఉంది



మేము అనకాపల్లి దగ్గర తుమ్మపాల నుంచి 15 ఏళ్ల క్రితం పెదగంట్యాడ వచ్చాం. వియ్యపువానిపాలెంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. ఇక్కడ నా భర్త వెల్డింగ్ పనులు చేస్తుంటారు. మాకు భానోజీతోటలో 430 చదరపు అడుగుల ఇల్లు మంజూరైంది. ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేశారు. మా సొంతింటి కల నెరవేరింది. చాలా సంతోషంగా ఉంది.
-కడిమి నాగలక్ష్మి, వియ్యపువానిపాలెం, పెదగంట్యాడ

అద్దె బాధ ఉండదిక..



మేము పాలవలసలో ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో ఉంటున్నాం. చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకీడుస్తున్నాం. వచ్చిన సంపాదనలో సగం డబ్బులు ఇంటి అద్దె కడుతున్నాం. ఇకపై మాకు అద్దె బెడద ఉండదు. ఆ డబ్బులను పొదుపు చేసుకుని భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకుంటాం. -చిటికిన అప్పలకొండ, పాలవలస, పెదగంట్యాడ

కల నెరవేరింది



మేము శ్రీకాకుళం నుంచి వలస వచ్చాం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పటి వరకూ అద్దె ఇళ్లలోనే ఉంటున్నాం. మాకు 365 చదరపు అడుగుల ఇల్లు వచ్చింది. ఇన్నాళ్లకు మాకు సొంత ఇల్లు వస్తోంది. మా అబ్బాయి, కోడలితో కలసి ఆ ఇంట్లో ఆనందంగా ఉంటాం. జగన్‌బాబుకు రుణపడి ఉంటాం.
-అర్జాల ధానయమ్మ, బర్మా కాలనీ, పెదగంట్యాడ

స్టీల్‌ప్లాంట్ శివాలయానికి భక్తులకు అనుమతి



ఆలయ కమిటీ సభ్యులకు అనుమతి పత్రం అందిస్తున్న జీఎం సంజీవరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు లోపలి శివాలయానికి బయటి నుంచి వచ్చే భక్తులకు ఉక్కు యాజమాన్యం అనుమతి ఇచ్చిందని ఆలయ కమిటీ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం కె.సంజీవరావును శనివారం కలిసి విజ్ఞప్తి చేయడంతో, ఆయన షరతులతో కూడిన అనుమతి మంజూరు చేశారు.ఈ విషయాన్ని వారు తెలియజేస్తూ భక్తులను ప్లాంట్ గేట్ల ద్వారా ఆలయం వరకు మాత్రమే అనుమతిస్తున్నామన్నారు. భక్తులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు, జిరాక్స్ కాపీ వెంట తెచ్చుకుని, గేట్ల వద్ద చూపించి లోపలికి రావాలని సూచించారు. విభాగాల్లో పర్యటించడం నిషేధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సురేంద్ర, ఎస్.జి.కె. వర్మ, కనకరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మేధావివర్గం మౌనం వీడాలి

- కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాలి
- ఉక్కు పోరాట కమిటీ నాయకులు
- 1024వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలోని మేధావి వర్గం మౌనం వీడి ప్రశ్నించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1024వ రోజు, శనివారం కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంలో ప్రజలను మరింత మమేకం చేసేవిధంగా ఉద్యమాలపై అవగాహన కల్పించాలన్నారు. అందుకు కార్మికవర్గం సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థిని అభినందిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించి, ఉన్నత స్థితికి ఎదగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ వి. విజయలక్ష్మి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన చైతన్య మహిళా జూనియర్ కళాశాల 29వ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. చైతన్య విద్యాసంస్థల ప్రెసిడెంట్ శకుంతల, వైస్ ప్రెసిడెంట్ మంత్రి శంకరనారాయణ, కరస్పాండెంట్ జీఎస్ఆర్ఎన్ వర్మ, కళాశాల ప్రిన్సిపాల్ రాధ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి సాధనకు కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రెండు, మూడు నెలల్లో సాధారణ స్థితికి చేరేలా కృషి చేస్తున్నామని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఇందుకు కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఉక్కు పరిపాలనా భవనంలో కార్మిక సంఘాలతో సీఎండీ, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాయబరేలి వీల్ ప్లాంట్, హెచ్‌బీ కాలనీలకు సంబంధించి సానుకూల నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉత్పత్తికి సంబంధించి సెయిల్, జేఎస్‌పీఎల్‌లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. వాటిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పెండింగ్ అంశాలను లేవనెత్తారు. దీనిపై కార్మిక సంఘాలు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3 పునరుద్ధరణ, కార్మికులకు వేతన సవరణ తదితర అంశాలపై యాజమాన్యం తీరును విమర్శించారు. చివరకు సమావేశంలో ఎటువంటి సానుకూల నిర్ణయం వెలువడలేదని కార్మిక సంఘాల నాయకులు పెదవి విరిచారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరు కొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై. మస్తానప్పు, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, గణపతిరెడ్డి, పాడి త్రినాథరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ బాలోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవం కార్యక్రమ పోస్టర్‌ను బాలోత్సవం, జిప్సా ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలోని సాయి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు పిల్లలమర్రి రఘు మాట్లాడారు. పిల్లల పండుగకు అన్ని ప్రైవేట్ స్కూళ్ల నుంచి పిల్లలు పాల్గొంటారన్నారు. ఆయా స్కూల్స్ కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, బాలోత్సవం ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.రమాప్రభ, జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

జగన్ అంటే ప్రజాభిమానం

- ఆ పేరే ప్రభంజనం
- అందుకే సీఎంగా మళ్లీ రావాలని ప్రజల ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి దేవన్‌రెడ్డి



75వ వార్డులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: జగన్ అంటే ప్రజాభిమానం... జగన్ అంటే ప్రభంజనం... జగన్ అంటే ప్రజారంజక పాలన.. అందుకే ముఖ్యమంత్రిగా జగనే మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెం నిర్వాసిత కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర, ఎన్నికల సమయాల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ సొంతం అన్నారు. శతశాతం హామీలు నెరవేర్చడంతో కొత్త పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రిని గెలిపించుకోడానికి ఓటర్లు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, గాజువాక మండల క్లస్టర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు యూత్ అధ్యక్షుడు పెదిరెడ్ల హరీష్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పిళ్లా కొండలరావు, యలమంచిలి అప్పారావు, కొలిపాక అప్పారావు, బొట్టా గంగరాజు, ఇల్లపు కొండలరావు, గొల్లవిల్లి పైడిరాజు, గెద్దాడ అప్పలరాజు, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



85వ వార్డులోని కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు



85వ వార్డులో మాట్లాడుతున్న దేవన్‌రెడ్డి

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. అందువల్లే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలని, జగనన్న పాలన కావాలని కోరుకుంటున్నారు. 75వ వార్డు దుర్గవానిపాలెం సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రాంతంలో.. అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నే మళ్లీ సీఎంగా రావాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


70వ వార్డులో..



70వ వార్డులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి

గాజువాక: వార్డు సచివాలయ పరిధిలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 70వ వార్డు చిట్టినాయుడు కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయ పరిధిలో రూ.23కోట్ల 4లక్షల, 72వేల విలువైన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించామన్నారు. ఒక వార్డు పరిధిలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు లబ్ధిదారుల చేతుల్లోకి వెళ్లడం ఏ ప్రభుత్వంలో జరగలేదని, భవిష్యత్‌లో జరగబోదని.. కేవలం జగన్ ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, నాయకులు పొలగాని కృష్ణ, రంగాల పైడిరాజు, రాములమ్మ, నీలకంఠ, గోపీ, అచ్చిబాబు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



పూజలందుకున్న గౌరీ పరమేశ్వరులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా గౌరీ పరమేశ్వరులను ఊరేగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్ల కాశీబాబు, జిల్లా కేంద్ర సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్రీ సన్యాసినాయుడు, గౌరీ సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.96 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి

అగనంపూడి: శ్మశానవాటికల అభివృద్ధికి అధిక శాతం నిధులు వెచ్చిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు మంత్రిపాలెంలోని శ్మశాన వాటికలో రూ.96లక్షలతో ఏర్పాటు చేయనున్న అదనపు వసతులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికల అభివృద్ధి దాదాపు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జెడ్సీ సింహాచలం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, సీనియర్ నాయకులు పచ్చికోరు రమణమూర్తి, సుందరపు అప్పారావు, సేనాపతి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణే లక్ష్యం

అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ



లేమర్తి హైస్కూల్లో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు రాగిజావ, చెక్కీలు, జగనన్న గోరుముద్ద వంటి పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. ప్రతీ ఒక్కరూ వీటిని తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ అవర్‌లో ఉన్న పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తరువాత రక్తహీనత గల పిల్లల వివరాలు సేకరించారు. వారు విధిగా ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్స్ వేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అమ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన చిల్డ్రన్స్ ఫెస్టివల్



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న బాలుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో రెండు రోజుల పాటు జరిగిన చిల్డ్రన్స్ ఫెస్టివల్ శనివారం ఘనంగా ముగిసింది. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ (వీసీసీ) ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రం, జ్యోతి బాలవిహార్ ఆవరణల్లో జరిగిన ఫెస్టివల్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. రెండో రోజు లఘు నాటికలు, పాటలు, విచిత్ర వేషధారణ (ఫ్యాన్సీ డ్రెస్), కథ చెప్పడం, సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శన, సృజనాత్మక వస్తువుల తయారీ, మట్టితో బొమ్మలు, జానపద గీతం, న్యూస్ రైటింగ్, దేశభక్తి గీతం తదితర అంశాల్లో పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి, విశాఖ రోటరీ క్లబ్ అధ్యక్షులు డి.ఎం.రావు మాట్లాడుతూ ఇటువంటి ఫెస్టివల్స్ నిర్వహించడం ద్వారా పిల్లల సృజనాత్మకను తెలియజేశారన్నారు. కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీసీసీ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ఫెస్టివల్‌ను విజయవంతం చేసిన న్యాయనిర్ణేతలు, వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు